


కరుణించు మేరీమాత

ఘనంగా గుణదల తిరునాళ్లు ప్రారంభం

మొదటిరోజు పోటెత్తిన భక్తులు





గుణదల మేరీమాత 101వ మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, విక్టర్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు తదితర గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అంతకుముందు గుణదల పురవీధుల్లో మేరీమాత తేరు ప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం కావడంతో ప్రార్థనామందిరంతో పాటు మేరీమాత గుహ, శిలువ మార్గంలో భక్తులు కిటకిటలాడారు.

6లో



వీరమ్మ తల్లి ఊయల ఉత్సవానికి హాజరైన అశేష భక్త జనసందోహం (ఇన్‌సెట్‌లో) ఊయల ఊగుతున్న అమ్మవారు



నేత్రపర్వం

వైభవంగా వీరమ్మ తల్లి ఊయల ఉత్సవం

- తిరుగండ దీపాలతో దేదీప్యమానంగా వెలిగిన ఉయ్యూరు
- ప్రధాన రహదారిలోని ఆలయంలో కొలువుతీరిన అమ్మవారు

ఉయ్యూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తల్లి ఊయల ఉత్సవం భక్తజనసందోహం నడుమ ఆదివారం నేత్రపర్వంగా సాగింది. పదిహేను రోజు పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మెట్టినింటి నుంచి బయలుదేరిన అమ్మవారు నగర వీధుల్లో వైభవంగా ఊరేగి ప్రధాన సెంటర్ సమీపంలోని ఊయల స్తంభాల వద్దకు చేరుకున్నారు. కన్నుల పండువగా ఊయల ఉత్సవం జరుపుకున్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఉయ్యూరు జనసంద్రంగా మారింది. ప్రధాన సెంటర్‌తో పాటు అమ్మవారి ఆలయం, కాటూరు రోడ్డు, బస్టాండ్ రోడ్లు కిక్కిరిశాయి. తిరుగండ దీపాలతో ఉయ్యూరు దేదీప్యంగా వెలిగింది. ఊయల ఉత్సవం అనంతరం అమ్మవారు ప్రధాన రహదారిలోని ఆలయంలో కొలువుతీరారు. అక్కడి నుంచి భక్తులకు దర్శనమిస్తున్నారు.

తొక్కిసలాట.. త్రుటిలో తప్పిన ప్రమాదం

ఊయల ఉత్సవంలో తొక్కిసలాట జరగగా, త్రుటిలో పెద్దప్రమాదం తప్పింది. ఈ ఘటనలో పలువురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. అమ్మవారి పల్లకీ ఊయల స్తంభాల వద్దకు వస్తున్న తరుణంలో పోలీసుల రోప్‌వే వైపు నుంచి కాకుండా బారికేడ్లు ఉన్న వైపు నుంచి భక్తులు ఒక్కసారిగా రావడంతో తోపులాట జరిగింది. బారికేడ్ల కిందపడి మహిళలు గాయపడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు కిందపడిపోయిన వారిని లేపి పరిస్థితి చక్కదిద్దారు.

ఎమ్మెల్సీ ఎన్నిక ఫిర్యాదులకు గుంటూరు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్

6లో

అవే తప్పులు..!

భూముల రీసర్వేలో గ్రామ సర్వేయర్ల నిర్వాకం

టార్గెట్లు నిర్దేశించకున్నా హడావిడిగా పనులు

భూముల రీసర్వేలో మళ్లీ గత తప్పిదాలే చోటుచేసుకుంటున్నాయి. క్షేత్రస్థాయిలో సర్వేయర్ల నిర్లక్ష్యం, నిర్వాకాల కారణంగా సర్వే నెంబర్ల రీ ఫిక్సేషన్‌ను సరిగ్గా చేయట్లేదని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా కాకుండా, గ్రామ సర్వేయర్ల ఇష్టారాజ్యంగా రీసర్వే జరగటం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

- సర్వేలో భూమి ఎక్కువగా తేలితే బేరాలు
- క్షేత్రస్థాయిలో పరిశీలన లేకుండానే లెక్కలు
- గూగుల్ మ్యాప్ ఆధారంగా అస్తవ్యస్తంగా..
- అర్జీలు పరిష్కారమయ్యాయని సంతకాలకు డిమాండ్
- లబోదిబోమంటున్న భూ యజమానులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని భూముల రీసర్వే కొత్త సమస్యలు తెచ్చి పెడుతోంది. గ్రామ సర్వేయర్లు బేరాలు పెట్టడం మొదలుపెట్టేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరపకుండా సర్వే నెంబర్‌ను, అందులోని సబ్ డివిజన్స్ పరిధిలోని భూములను పరిశీలించకుండా, కనీసం రైతులతో కూడా మాట్లాడకుండా పని కానిచ్చేస్తున్నారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా ఓ అంచనాకు వచ్చి, ఆ భూమి నాలుగు వైపులా కొలతలు తీసుకుని రీసర్వే చేసేస్తున్నారు.

సమస్యలు ఇలా..

భూముల శిస్తుల కోసం బ్రిటీషు కాలంలో బీ నెంబర్లు ఇచ్చారు. 1925లో సరిహద్దు బౌండరీల చట్టం ఏర్పడ్డాక రీ సర్వే ప్రారంభమైంది. ఒక సర్వే నెంబర్‌లో గరిష్ఠంగా 20 ఎకరాల్లోపు ఉంటుంది. మాగాణి అయితే 10, మెట్ట అయితే 20 ఎకరాల్లోపు ఉంటుంది. రీ సర్వేలో ముఖ్యంగా సదరు సర్వే నెంబర్‌లో ఎంతమంది ఉన్నారు, విస్తీర్ణం ఎంత.. అనేది రీ ఫిక్సేషన్ చేయాలి. ఇది ఎంత సమర్థవంతంగా చేయగలిగితే రీసర్వే అంత చక్కగా ఉంటుంది. నిర్ణీత పరిమాణం కంటే భూమి ఎక్కువ ఉంటే.. ఆ సర్వే నెంబర్ పరిధిలోని వారికే తలా కొంత పంచుతూ సర్దుబాటు చేయాలి. కానీ, కొంతమంది సర్వేయర్లు ఆ మిగులు భూమిని వేరే సర్వే నెంబర్‌లోని వారికి కలపటానికి బేరాలు కుదుర్చుకుంటున్నారు. ఒకచోట ఉన్న ఎక్కువ భూమిని మరో సర్వే నెంబర్‌లోని తాను బేరం కుదుర్చుకున్న సబ్ డివిజన్ హోల్డర్‌కు కలిపితే రీసర్వేలో శాస్త్రీయత కనిపించదు. ఎక్కువ, తక్కువలు రావటానికి దోహదపడుతుంది. భవిష్యత్తులో ఇది సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి సర్వేయర్లు సర్వే నెంబర్ల ప్రాతిపదికన కాకుండా ఆ గ్రామ ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ (ఎఫ్ఎంబీ) ఆధారంగా రీ ఫిక్సేషన్‌ను సక్రమంగా చేపట్టాలి. అలాగే, కొన్ని సర్వే నెంబర్లలో భూమి తక్కువగా చూపించే అవకాశముంది. పూర్వం రోజుల్లో గొలుసులతో కొలవటం వల్ల అంత ప్రామాణికంగా సర్వే జరగకపోయి ఉండొచ్చు. కాల్వగట్లను, ఇతర పోరంబోకులను కూడా కలుపుకొని అప్పట్లో మాన్యువల్ విధానంలో ఎక్కువగా నమోదు చేయించుకుని ఉండొచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఎక్కువ, తక్కువలు తప్పకుండా వస్తాయి. ఎక్కువ వస్తే బేరాలు పెట్టుకుని వేరే సర్వే నెంబర్ల వారికి కలిపి చూపటం, తక్కువ వస్తే వారికి అర్థమయ్యేలా చెప్పకపోవటం వంటి అంశాలు ప్రస్తుతం రీసర్వేలో ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఆరోజు ఎంతమందికి రీసర్వే పూర్తి చేశామని సర్వేయర్లు ఆలోచిస్తున్నారే కానీ, గ్రామం అనే పరిధిని దృష్టిలో ఉంచుకుని నిర్వహించటం లేదన్న విమర్శలు భూ యజమానుల నుంచి వస్తున్నాయి. సర్వే నెంబర్ల రీ ఫిక్సేషన్ సక్రమంగా జరగకపోతే పోరంబోకు భూములు అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఉంది.

రైతులపై సర్వేయర్ల ఒత్తిడి

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అడ్డగోలు సర్వేతో రైతుల భూములకు సంబంధించి చాలా వివాదాలు తలెత్తాయి. ఎన్టీఆర్ జిల్లాలోనే 3 వేల వరకు రైతుల నుంచి ప్రజా ఫిర్యాదుల వేదికకు ఫిర్యాదులు అందాయి. కృష్ణాజిల్లాలో పరిస్థితి కూడా అదే. మొత్తంగా 6 వేల వరకు అర్జీలు అందాయి. వీటి పరిష్కారం రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. ఆరు నెలలుగా బాధితులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఏ ప్రయోజనం లేదు. కాగా, ఈ అర్జీలను పరిష్కరించాల్సిన అధికారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. మీరు పెట్టిన అర్జీలు పరిష్కారమయ్యాయని సంతకం చేసి ఇవ్వాలంటున్నారు. ఇలా చేస్తే పెండింగ్ శాతాన్ని తగ్గించుకోవచ్చన్నది వీఆర్వోలు, సర్వేయర్ల అభిప్రాయం. కానీ, ఇలాంటి అర్జీలకు సంబంధించి కూడా రీసర్వే చేస్తే సమస్య పరిష్కారమవుతుంది. ఆ పని మాత్రం చేయట్లేదు. గ్రామానికో సర్వేయర్ ఉన్నా సమస్యను ఎందుకు పరిష్కరించటం లేదో అర్థంకాని పరిస్థితి. ఈ అంశాలపై రెండు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు సీరియస్‌గా దృష్టి సారించకపోతే రైతుల్లో అసంతృప్తి పెరిగే అవకాశముంది.



నాట్య పరిమళాల గుబాళింపు

ముగిసిన శ్రీసిద్ధేంద్ర యోగి జయంత్యుత్సవాలు

అఖిల భారత కూచిపూడి నాట్య కళామండలి ఆధ్వర్యంలో నాట్యాంజలి ప్రదర్శన

6

పేరుకుపోయిన దుర్గగుడి షాపుల అద్దె బకాయిలు

- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్న లీజు విభాగం

6లో

గీత కార్మికుల మద్యం షాపులకు 621 దరఖాస్తులు

- ఎన్టీఆర్‌లో 335..కృష్ణాకు 286
- షాపుల కేటాయింపు డ్రా వాయిదా
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

6లో





అధైర్యపడొద్దు.. అన్నివిధాలా ఆదుకుంటాం

- వేటకెళ్లి సముద్రంలో జారిపడిన ఏడుకొండలు కుటుంబానికి మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శ

6లో

ఉమ్మెత్త కాయ తిని తాపీ కార్మికుడు మృతి

6లో



ఊరేగుతున్న వీరమ్మ, గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా వీరమ్మ గ్రామోత్సవం

● మెట్టినింటి నుంచి ఆలయానికి చేరిన అమ్మవారు

ఉయ్యూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వీరమ్మతల్లి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రావిచెట్టు సెంటర్ సమీపాన మెట్టినింటి నుంచి శనివారం రాత్రి బయలుదేరిన అమ్మవారు మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ, తిరుగు గండదీపాల భక్తులు వేలాది మంది వెంట రాగా పురవీధుల్లో ఊరేగారు. అమ్మవారికి దీపారాధన చేసి, పసుపు కుంకుమ అందించి, పల్లకీ వెంట వేలాది భక్తులు నడిచారు. గ్రామోత్సవం అనంతరం ఊయల స్తంభాల వద్ద ఊయలలూగి ప్రధాన రహదారిపై ఉన్న ఆలయానికి ఆదివారం రాత్రికి అమ్మవారు చేరుకున్నారు.



గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల 1971-1978 బ్యాచ్

అపూర్వ సమ్మేళనం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల(1971-1978 బ్యాచ్) పూర్వ విద్యార్థుల సంఘం 'మిత్రమా స్వాగతం'(మిస్వా) ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో వారి కుటుంబసభ్యులతో సహా సమావేశమైంది. యాభై మూడేళ్ల స్నేహానికి గుర్తుగా నాటి తీపి జ్ఞాపకాలను వారంతా గుర్తుచేసుకున్నారు. అప్పటి ఆంగ్ల అధ్యాపకుడు చిరుమామిళ్ల సాంబశివరావును సత్కరించారు. మిస్వా వేదిక ద్వారా సామాజిక కార్యక్రమాల్లో భాగమవుతామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల మల్లికార్జునరావు(న్యూఢిల్లీ) ప్రకటించారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట నరేంద్రదేవ, మేరుగ శివాజీ, వెన్నా వల్లభరావు, కేవీఎస్ఎస్ మూర్తి, పువ్వుల సుధాకర్, వెలిచేటి సత్యనారాయణ పాల్గొన్నారు.



జీవీజే బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి 1974-1975 బ్యాచ్

ఉల్లాసంగా..ఉత్సాహంగా

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జీవీజే బాలుర ఉన్నత పాఠశాలలో 1974-1975లో పదో తరగతి చదువుకున్న వారంతా పట్టణంలోని ఉక్కు కళావేదికలో సమావేశమై ఆదివారం ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. పాఠశాల స్థల దాత గెంటేల వెంకటజోగయ్య ముని మనవడు పార్థసారథి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. యాభై ఏళ్ల క్రితం చదువుకున్న వారంతా ఇలా కలుసుకోవటం చరిత్రాత్మకమని, వారి చిరునామాలు గుర్తించి, సమీకరించిన నిర్వాహకులు అభినందనీయులు అని మాజీ ఎంఈవో వెంకటేశ్వరశర్మ, ప్రస్తుత హెచ్ఎం మాధవీలత అన్నారు. అమెరికా నుంచి ఈ సమావేశానికి విచ్చేయడం వారి స్నేహశీలతకు దర్పణమన్నారు. పూర్వ విద్యార్థులందరికీ వారి పేరు, ఫొటోతో మెమొంటోను నిర్వాహకులు అందించారు. పసుపుల పుల్లారావు(ఇల్లెందు), మెరిశెట్టి రంగారావు, వీరవల్లి శ్రీనివాసరావు, నాగళ్ల రాజా, ఎన్.ధనమూర్తి, పబ్బిశెట్టి రాండన్, న్యాయవాది గోనెల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేరుకుపోయిన దుర్గగుడి
షాపుల అద్దె బకాయిలు

● నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్న లీజు విభాగం

(ఆంధ్రజ్యోతి-ఇంద్రకీలాద్రి)

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం నుంచి లీజుకు తీసుకుని కనకదుర్గనగర్‌లో షాపుల నిర్వహిస్తున్న కొందరు దేవస్థానానికి బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. ఈ ఏడాది జనవరి వరకు రూ.30 లక్షల మేర షాపుల నిర్వాహకులు బకాయిపడ్డారు. గతంలో షాపులు లీజుకు తీసుకున్న వారు రూ.1,05,18,828 బకాయిపడ్డారు. లీజు విభాగం అధికారులు బకాయిపడిన వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చినా, వసూలు చేయడానికి గట్టి చర్యలు తీసుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ నాయకుడు ఒకరు నిర్వహిస్తున్న రెండు షాపులకు రూ.30 లక్షలు బకాయి పడ్డారని, మరో 5 షాపుల యజమానులు రూ.11 లక్షల నుంచి రూ 19 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుందని తెలుస్తోంది. బకాయిలు వసూలు చేయడానికి వెళుతున్న అధికారులు నిర్వాహకులకు భయం కలగకుండా వ్యవహరించడంతో బకాయిలు కొండలా పేరుకుంటున్నాయని చెబుతున్నారు.

పెద్ద మొత్తంలో బకాయిలున్న వారికి నోటీసులు

గతంలో షాపులు నిర్వహించి పెద్ద మొత్తంలో బకాయిలు పడిన వారికి లీగల్ నోటీసులు సిద్ధం చేస్తున్నట్టు లీజులు, లీగల్ విభాగం ఏఈవో దుర్గారావు తెలిపారు. ప్రస్తుత యజమానులకు కూడా ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, మరో దఫా నోటీసులు ఇస్తామని ఆయన తెలిపారు.

ఉమ్మెత్తకాయ తిని తాపీ కార్మికుడి మృతి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దేహానికి బలం చేకూరుతుందన్న ఆశతో ఉమ్మెత్తకాయ తిని తాపీ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన ఉంగుటూరు మండలం తేలప్రోలులో జరిగింది. దీనిపై ఆదివారం జంక్షన్ పీఎస్‌లో కేసు నమోదైంది. ఎస్సై వి.సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తేలప్రోలు గ్రామానికి చెందిన తాపీ కార్మికుడు మంచాల రమేశ్(38) శనివారం బాపులపాడు మండలం బొమ్ములూరులో పనికి వెళ్లాడు. అక్కడ మధ్యాహ్నం బహిర్భూమికని వెళ్లాడు. అక్కడ ఉమ్మెత్తకాయను తిన్నాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన తర్వాత అతడి పరిస్థితి విషమించింది. కుటుంబసభ్యులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

పుణె జాతీయ సదస్సులో
ఎమ్మెల్యే కుమార్‌రాజా ప్రసంగం

పామర్రు/పమిడిముక్కల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఔత్సాహిక ప్రజాప్రజాప్రతినిధులకు పుణెలోని ఎంఐటీ విశ్వవిద్యాలయం ఫౌండర్ రాహుల్ కరాడ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ లెజిస్లేచర్స్ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సమాజానికి సేవలందించడం, నాయకత్వ లక్షణా లు పెంచుకోవడంపై అవగాహన కలిపించారన్నారు. ఆదివారం పుణె నుంచి విలేకరులతో ఆయన మాట్లాడారు. రెండో రోజు సభలో తాను ప్రసంగించానన్నారు. దేశవ్యాప్తంగా 300 మంది ఆలోచనలు పంచుకున్నారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్నాయుడు, మహారాష్ట్ర సీఎం దేవేంద్రఫడ్నవిస్, లోక్‌సభ మాజీ స్పీకర్ సుమిత్ర మహారాజ్ సందేశాలు ఇచ్చారని తెలిపారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



జ్యోతి ప్రజ్వలన చేసి గుణదల మహోత్సవాలు ప్రారంభిస్తున్న విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు, భక్తులతో కిటకిటలాడుతున్న గుణదల పుణ్యక్షేత్రం పరిసరాలు



అంగరంగ వైభవంగా..

గుణదల లూర్దుమాత 101వ మహోత్సవాలు ప్రారంభం

గుణదల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): 'మరియమాతకు కష్టాలు, బాధలు విన్నవించుకుంటే ఆమె ప్రార్థనను దేవుడు ఆలకించి మన సమస్యలు తొలగిస్తారు. భక్తులను దేవుని మార్గంలో నడిపించడానికి మరియ మాత అనేక ప్రాంతాల్లో దర్శనమిచ్చారు.' అని విజయవాడ కతోలిక పీఠం బిషప్ మోస్ట్ రెవరెండ్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. గుణదల కొండపై కొలువైన లూర్దు మాత 101వ మహోత్సవాలు ఆదివారం ఉదయం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7గంటలకు బిషప్ గ్రాసీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళావేదికపై బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, వికర్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు తదితర గురువులు జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. 2025 సంవత్సరాన్ని జగద్గురువు పరిశుద్ధ పోప్ ఫ్రాన్సిస్ జూబ్లీ సంవత్సరంగా ప్రకటించారని బిషప్ భక్తులకు సందేశమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన పూజాపీఠంపై స్వర్ణ జూబిలేరియన్ ఫాదర్ పి.కె.జోసఫ్‌తో కలిసి బిషప్ జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ ఎం.గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, ఎడ్యుకేషన్ డస్క్ డైరెక్టర్ కొలకాని మరియప్ప, ఎస్ఎస్‌సి డైరెక్టర్ తోట సునీల్ రాజు, డయాసిస్‌కు చెందిన గురువులు ప్రారంభ పవిత్ర దివ్యపూజాబలి సమర్పించారు. పూజ అనంతరం గురువులు మువ్వల ప్రసాద్, పల్లె జోజిబాబు పసల తోమస్ తదితరులు కతోలిక క్రైస్తవ భక్తులకు దివ్య సత్ప్రసాదం అందజేశారు.



దివ్యపూజాబలి సమర్పిస్తున్న గురువులు

పురవీధుల్లో మేరీమాత తేరు ప్రదక్షిణ

గుణదల పురవీధుల్లో మేరీమాత తేరు ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ ప్రారంభించారు. మేరీమాత ఆశీస్సులు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నారు. తేరు ప్రదక్షిణ ప్రధాన చర్చి నుంచి ప్రారంభమై గంగిరెద్దుల దిబ్బ, గాంధీబొమ్మ సెంటర్, గుణదల సెంటర్, ఏలూరు రోడ్డుమీదుగా లూర్దునగర్, బెథ్లహేమ్‌నగర్‌ల నుంచి తిరిగి చర్చి వద్దకు చేరుకుంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేరీమాత ప్రతిమను ఉంచి భక్తిగీతాలు ఆలపిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెక్టర్ యేలేటి విలియం జయరాజు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు నిర్మలా కుమారి, మాధురి, అంబేడ్కర్ పాల్గొన్నారు.



తేరు ప్రదక్షిణను ప్రారంభిస్తున్న దేవినేని అవినాశ్



మోకాళ్లపై నడిచి వెళుతున్న భక్తులు



కొవ్వొత్తులు వెలిగిస్తున్న క్రైస్తవులు



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు

బందోబస్తు పర్యవేక్షించిన సీపీ

గుణదల: మేరీమాత ఉత్సవాల బందోబస్తును నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు పర్యవేక్షించారు. ఆదివారం మధ్యాహ్నం గుణదలలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ వద్దకు చేరుకుని ఎల్‌సీడీ టీవీల ద్వారా రద్దీగా ఉన్న ప్రదేశాలను గుర్తించారు. డ్రోన్ కెమెరాలు, ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపై దృష్టి సారించారు. ఏలూరు రోడ్డులో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవాలని ఏసీపీ దామోదర్‌ను ఆదేశించారు. ప్రధాన చర్చి, కొండ మధ్యలో మేరీమాత గుహ, కొండ శిఖరాగ్రానగల యేసుక్రీస్తు శిలువ వద్ద భక్తుల దర్శనాలు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. భక్తులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. డీసీపీ గౌతమి షాలి, ట్రైనీ ఐపీఎస్ మనీషా, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, ఏడీసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నాట్యమయూరాలై..

● ముగిసిన సిద్ధేంద్ర యోగి జయంత్యుత్సవాలు

కూచిపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సిద్ధేంద్ర యోగి జయంత్యుత్సవాల్లో భాగంగా అఖిలభారత కూచిపూడి నాట్య కళా మండలి ఆధ్వర్యంలో కూచిపూడి సిద్ధేంద్ర యోగి కళావేదికపై రెండు రోజులుగా ప్రదర్శిస్తున్న కూచిపూడి నాట్యాంశాలు నాట్యపరిమళాలను వెదజల్లి ఆదివారం రాత్రితో ముగిశాయి. ముగింపు రోజున విజయవాడకు చెందిన నాద పద్మ నారాయణ తీర్థుల తరంగం అంశాన్ని ప్రదర్శించి నాట్యాంశాలకు శ్రీకారం చుట్టారు. కొత్తగూడేనికి చెందిన శ్రీ దుర్గాసాయి నృత్య కళానికేతన్ విద్యార్థులు మనీషా, శ్రీనిజలు యుగళ నర్తనంలో చూపిన హావభావాలు అబ్బురపరిచాయి. నందిపల్లి సాహితీ అలోకయే శ్రీ బాలకృష్ణం అంశాన్ని ప్రదర్శించి రంజింపజేశారు. విజయవాడకు చెందిన శ్రీ సత్యకళానిలయం విద్యార్థులు సత్యానందిని, రమ్యసాహితీలు శ్రీ శంకరగిరి నాదప్రభో, కూచిపూడి వైభవం అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆనందడోలికల్లో ముంచెత్తారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ లలితా స్కూల్ ఆఫ్ డ్యాన్స్ విద్యార్థులు లలితా సింధురి, రిత్విక, తన్వి, రితికలు సరస్వతీ స్తుతి, రామాయణ శబ్దం, రుక్మిణి ప్రవేశ దరువు, అష్టలక్ష్మీ స్తోత్రం, దశవతార హారతి అంశాలు ప్రదర్శించి ఆద్యంతమూ భక్తిభావంలో ముంచెత్తారు. అతిథులను, కళాకారులను నిర్వాహకులు వేదాంతం రాధేశ్యామ్, మృత్యుంజయ శర్మ, హరనాథ శాస్త్రిలు మెమెంటోలు అందించి సత్కరించారు.



సత్యానందిని, రమ్య సాహితీల అభినయం



మనీషా-శ్రీనిజల యుగళ నర్తనం



కనకదుర్గమ్మ సన్నిధిలో నటుడు అక్కినేని నాగచైతన్య, తండేల్ చిత్ర బృందం

దుర్గమ్మ సేవలో అక్కినేని నాగచైతన్య

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తండేల్ సినిమా కథానాయకుడు అక్కినేని నాగచైతన్య, చిత్ర బృందంతో కలిసి ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీస్సులు అందించారు. అమ్మవారి లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాలను అధికారులు అందజేశారు. చిత్ర నిర్మాత బన్నీ వాసు, దర్శకుడు మొండేటి చందు అమ్మవారిని దర్శించుకున్నారు.

సర్వేశ్వరరావుకు పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న ఆల్ ఇండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు ఎన్.సర్వేశ్వరరావును ఆదివారం విజయవాడ సూర్యారావుపేటలోని ఆయన నివాసంలో నాగచైతన్య పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గీత షాపులకు 621 దరఖాస్తులు

● ఎన్టీఆర్ జిల్లాలో 335..కృష్ణాకు 286

● షాపుల కేటాయింపు డ్రా వాయిదా

● ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) ఉమ్మడి కృష్ణాజిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఎన్టీఆర్ జిల్లాలో 11, కృష్ణాజిల్లాలో 12 రిజర్వేషన్ షాపులకు కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఎన్టీఆర్ జిల్లాలో..		కృష్ణా జిల్లాలో..	
విజయవాడ	71	మచిలీపట్నంకార్పొరేషన్	40
జగ్గయ్యపేట	21	గుడివాడమున్సిపాలిటీ	32
కొండపలి	47	పెడనమున్సిపాలిటీ	13
వీరులపాడు	27	తాడిగడపమున్సిపాలిటీ	60
వత్సవాయి	31	గూడూరు	17
తిరువూరు	20	గుడివాడ	15
ఎ.కొండూరు	31	పమిడిముక్కల	30
నందిగామ	31	పెడన	16
రెడ్డిగూడెం	18	మచిలీపట్నం	16
విస్సన్నపేట	16	కోడూరు	14
జగ్గయ్యపేట		పెదపారుపూడి	11
రూరల్	22	బంటుమిల్లి	22
మొత్తం	335	మొత్తం	286

ఈ షాపులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లాలో 11 షాపులకు 335, కృష్ణాజిల్లాలో 12 షాపులకు 286 దరఖాస్తులు అందాయి. అత్యధిక దరఖాస్తులు విజయవాడ కార్పొరేషన్‌లోని షాపునకు వచ్చాయి. ఈ షాపునకు 71 దరఖాస్తులు అందాయి. కృష్ణా జిల్లాలో తాడిగడప మున్సిపాలిటీ షాపునకు 60 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఈ షాపులను గీత కార్మిక కులాల్లో ఉన్న గౌడ, శెట్టిబలిజ వర్గాలకు కేటాయించారు. శెట్టిబలిజ సామాజిక వర్గానికి కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, ఎన్టీఆర్ జిల్లాలో విస్సన్నపేటలో షాపులను రిజర్వ్ చేశారు. మిగిలిన షాపులను గౌడ సామాజిక వర్గానికి కేటాయించారు. ఈ దరఖాస్తులు పరిశీలించిన అనంతరం ఈనెల పదో తేదీన లాటరీ ద్వారా షాపులను కేటాయించాల్సి ఉంది. దీనిపై ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రభావం పడింది. కోడ్ అమల్లో ఉన్నందున పదో తేదీన నిర్వహించాల్సిన లాటరీని వాయిదా వేస్తున్నట్టు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. తదుపరి డ్రా తేదీని త్వరలో తెలియజేస్తామని స్పష్టం చేశారు.



చింతా ఏడుకొండలు కుటుంబాన్ని పరామర్శించాక విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అధైర్యపడొద్దు..
అన్నివిధాలా ఆదుకుంటాం

● వేటకెళ్లి సముద్రంలో జారిపడిన ఏడుకొండలు కుటుంబానికి మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేటకు వెళ్లి ఈనెల 1న పడవ నుంచి సముద్రంలో జారిపడిన చింతా ఏడుకొండలు భౌతికకాయం కోసం ప్రభుత్వం తీవ్రంగా గాలిస్తోందని, అధైర్యపడొద్దని అన్ని విధాలా ఆదుకుంటామని కుటుంబసభ్యులకు మంత్రి కొల్లు రవీంద్ర భరోసా ఇచ్చారు. బందరు మండలం తాళ్లపాలెం పంచాయతీ సత్రవపాలెంలో ఏడుకొండలు భార్య వెంకటేశ్వరమ్మ, కుటుంబసభ్యులను మంత్రి ఆదివారం పరామర్శించారు. ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఎంత గాలించినా భౌతికకాయం దొరకలేదని, బోటు యజమాని బలగం ఏడుకొండలు, చుట్టుపక్కల బోటు యజమానులు, మత్స్యశాఖ, మెరైన్, రెవెన్యూ అధికారులు తీవ్రంగా గాలిస్తున్నారని ఆయన తెలిపారు. గాలింపుపై కలెక్టర్ బాలాజీ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఇప్పటికి ఏడుకొండలు సముద్రంలో జారిపడి పది రోజులయిందని, 15 రోజులు దాటితే ఆర్డీవో, డీఎస్పీ, మత్స్యశాఖ అధికారులతో పంచనామా చేయించి సర్టిఫికెట్లు తీసుకుంటామని, ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని సహాయక చర్యలు అందిస్తామని తెలిపారు. ఏడుకొండలుకు టీడీపీ సభ్యత్వం ఉందని, రూ. 5 లక్షల సాయం అందుతుందన్నారు. ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటున్నా ఘటనను మాజీ మంత్రి పేర్ని నాని రాజకీయం చేయడం దురదృష్టకరమన్నారు. వైసీపీ నాయకులు ఏమీ చేయకుండా విమర్శలకు దిగడం పరిపాటన్నారు. గోపు సత్యనారాయణ, కుంచే నాని, లంకే శేషగిరిరావు, తలారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు సత్యకుమార్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కామినేనిశ్రీనివాస్, పల్లెం పెద్దేశ్వరరావు తదితరులు

అత్యాధునిక వైద్య సౌకర్యాలతో బహుళ ప్రత్యేకతల
పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభం

వన్‌టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వైద్య సౌకర్యాలతో బహుళ ప్రత్యేకతల పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్‌ను ప్రారంభించడం హర్షదాయకమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడలో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మల్టీ స్పెషాలిటీ ట్రామా, క్రిటికల్ కేర్ సెంటర్‌గా రూపొందించిన పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి వెలిగించారు. ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అందుకు అనుగుణంగా హెల్త్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, ఎన్టీఆర్ వైద్యసేవలను వివరించారు. ప్రజలకు తక్కువ వ్యయంతో కార్పొరేట్ వైద్యసేవలు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. పాతికేళ్లుగా తక్కువ వ్యయంతో వైద్యసేవలు అందిస్తున్న పెద్దేశ్వరరావును మంత్రి అభినందించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద క్రిటికల్ కేర్ సెంటర్‌ను ప్రారంభించామని, ప్రజలకు మరింత విస్తృతంగా సేవలు అందిస్తామని ఎండీ పల్లెం పెద్దేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో క్రిటికల్ కేర్‌సెంటర్‌ను ఏర్పాటు చేశామని, 150 బెడ్లు, 8 ఐసీయూలు, 100 క్రిటికల్ కేర్ బెడ్లు ఇంకా ఇతర విభాగాలు ఉన్నాయని సీఈవో డాక్టర్ పల్లెం ఆకాశ్ వివరించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, కామినేని శ్రీనివాస్, స్టార్ ఆస్పత్రి ఎండీ మన్నవ గోపీచంద్, వైద్యులు సీహెచ్ ప్రసాద్‌బాబు, ఎస్.భాను ప్రభాకర్, వి.సుశాంత్‌రెడ్డి, సింధు చాగంటి, పోతుల పవన్‌సాయి, కె.శ్రీనివాసబాబు, కొనకళ్ల రామ్‌ప్రతాప్, కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫిర్యాదులకు
గుంటూరు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్

మచిలీపట్నం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరుజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలకు అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ముగుస్తుందని డీఆర్వో కె.చంద్రశేఖరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాజిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను గుంటూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌నెంబరు 0863-2241029కు ఫోన్‌చేసి తెలియజేయాలని ఆయన సూచించారు.

మీకోసం పోర్టల్‌లో అర్జీలు నమోదు చేసుకోండి

● ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచన

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో ఎన్టీఆర్ జిల్లాలో కోడ్ అమల్లో ఉన్న కారణంగా సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ప్రతి సోమవారం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రస్సల్ సిస్టం కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామని పేర్కొన్నారు. ప్రజలు మీకోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని, ఇందుకు సమీప గ్రామ లేదా వార్డు సచివాలయాన్ని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

ఘనంగా వేంకటేశ్వరస్వామి వ్రతం



హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం సామూహిక శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు వ్రత ప్రాధాన్యత, ఆచరించడం వలన కలిగే లబ్ధిని వివరిస్తూ నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్టీ కాకాని బాబు, అరుణ దంపతులు ఉచితంగా పూజా సామాగ్రిని అందజేశారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఆలయ ట్రస్టీ తవ్వా పూర్ణచంద్రరావు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

సమన్వయలోపం!

- జంక్షన్‌లో నేలకొరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పోల్స్
- పట్టించుకోని విద్యుత్, గ్రామ పంచాయతీ అధికారులు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి)

జంక్షన్‌లో ప్రధాన నేషనల్ హైవే అధికారులు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ పోల్స్ ఒక్కొక్కటి విరిగి నేల కొరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బైపాస్ ఏర్పడిన తరువాత జంక్షన్ ప్రధాన రహదారులను అభివృద్ధి చేసి సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను నిర్మించడానికి నేషనల్ హైవే సంస్థ రూ.9 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఏలూరు-విజయవాడ రోడ్డులో వేలేరు అడ్డరోడ్డు నుండి బొమ్ములూరు రామిలేరు వాగు వరకు పోల్స్ ఏర్పాటు చేశారు. నూజివీడు రోడ్డులో 6, గుడివాడ రోడ్డులో 8 పోల్స్ నిర్మించారు. పోల్స్‌ను గత ఏడాది ఎన్నికలు ముందు నిర్మించారు. పోల్స్ మాత్రమే ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. విద్యుత్ కనెక్షన్ ఇచ్చి నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీకి అప్పగించాల్సి ఉంది. అధికారులు పట్టించుకోకపోవడంతో రహదారి మధ్య డివైడరు పై ఏర్పాటు చేసిన స్తంభాలు ఊక లారీలు ఢీకొనడంతో ఒక్కొక్కటీ విరిగి నేలకొరుగుతున్నాయి. నూజివీడు రోడ్డులో ఏర్పాటు చేసిన ఆరు పోల్స్‌లో గతేడాది నవంబరులో ఒక పోల్ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నేలకొరిగింది. శుక్రవారం రాత్రి మరో స్తంభం విరిగి నేలకొరిగింది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన లైటింగ్ పోల్స్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జంక్షన్ నూజివీడు రోడ్డులో ఊక లారీ ఢీ కొనడంతో నేలకొరిగిన స్తంభం

అల్పాహారం పంపిణీ

ఉయ్యూరు : వీరమ్మతల్లి భక్తులకు ఆదివారం అల్పాహారం పంపిణీ చేశారు. కాటూరు రోడ్డులోని అమృత కర్రీస్ అండ్ క్యాటరర్స్ అధినేత కుటుంబ రావు, కూరగాయల వ్యాపారి లక్ష్మణరావు, ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 7వేల మందికి పంపిణీ చేశారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా శ్రీలక్ష్మీ కర్పూర హోమం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశి సందర్భంగా రంగయ్యప్పారావుపేట శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీ కర్పూర హోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు లంక కమల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నుంచి నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమంలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. దొడ్డపనేని సుశీల, నర్రా సీతారత్నం, లింగం జ్యోతి, పరుచూరి వెంకటసుబ్బమ్మ, పొట్లూరి నాగ మల్లేశ్వరి, కోశాధికారి పరుచూరి సుకన్య, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



టీడీపీ నేత కె. రాజాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

టీడీపీ నేత రాజాకు పరామర్శ

గన్నవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత కె. రాజాను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం కారణాల వల్ల విజయవాడ ఆయుష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రాజాను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజాగళం కామ్రేడ్ సాంబశివరావు

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు : నిరంతరం పేద ప్రజల కోసం చివరి క్షణాల వరకు పోరాడిన మహోన్నతమైన వ్యక్తి కామ్రేడ్ కొంగన సాంబశివరావు అని, ఆయన మృతి బాధాకరమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం రామవరప్పాడు ఉప సర్పంచ్ కొంగన సాంబశివరావు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ, సుదీర్ఘకాలం సీపీఐలో పనిచేసి, ప్రజల పక్షాన గళమెత్తిన గొప్ప వ్యక్తి సాంబశివరావు అని కొనియాడారు. రామవరప్పాడుకు ఉప సర్పంచ్‌గా సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో రామవరప్పాడు మాజీ ఉప సర్పంచ్ కొల్లా ఆనంద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ కల్యాణోత్సవాలు ప్రారంభం



గన్నవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవ స్థానంలో అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి లక్ష పుష్పార్చన జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోరంకి భవ్యరామాలయానికి రూ. ఐదు లక్షల విరాళం

పెనమలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పోరంకిలో నిర్మిస్తున్న భవ్యరామాలయానికి స్థానిక భక్తులు మరో రూ. ఐదు లక్షల విరాళాలను అందించారు. ఆదివారం తాతినేని సదాశివరావు, జ్యోతి దంపతులు రూ. రెండులక్షలు, చనుమోలు పున్నయ్య, రాణి దంపతులు రూ. లక్ష, అత్తలూరి సత్యనారాయణ శర్మ, పార్వతమ్మ దంపతులు కుమారులు అక్షయలింగశర్మ, దశరథరామశర్మలు రూ. లక్ష, ప్రముఖ బిల్డర్ కాలమనేని చంద్రశేఖర్ రూ. లక్ష, పడితపు వెంకటరమణ, మహాలక్ష్మి దంపతులు ఆలయ ధ్వజస్తంభం, తలుపులు, దర్వాజలు విరాళాలుగా కోదండ రామాలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

వీరమ్మ భక్తులకు పాలు, మజ్జిగ పంపిణీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మతల్లి తిరునాళ్లలో భక్తులకు ఆదివారం వివిధ సంస్థలు, వ్యాపారస్తులు, వ్యక్తులు పాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు సగ్గున రామ సత్యకిషోర్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు బాదం పాలు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్, సుధీర్ టింబర్ డిపో ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెడ్డి రమణ, సాంబశివరావు, విజయ డెయిరీ సూపర్ వైజర్ పవన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.



విమానాశ్రయంలో హీరో నాగచైతన్య సందడి

గన్నవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయంలో ప్రముఖ సినీనటుడు నాగచైతన్య సందడి చేశారు. హైదరాబాద్ నుంచి విమానంలో తండేల్ చిత్ర బృందం ఆదివారం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయానికి వచ్చింది. నాగచైతన్యతో పాటు బన్నీ వాసు, చందు మొండేటి వచ్చారు. నాగచైతన్య రాకతో అతని అభిమానులు సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లారు.



కానూరులో ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాన్ని విడుదల చేస్తున్న మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి

చట్ట సభల్లోకి విద్యావంతులను పంపుదాం

రాష్ట్ర అగ్రికల్చరల్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపు

పెనమలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం, భవిష్యత్తు తరాల కోసం చట్టాలు రూపొందించే చట్ట సభల్లోకి ఉన్నత విద్యావంతులనే పంపిద్దామని ఏపీ అగ్రికల్చరల్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కానూరు టీడీపీ కార్యాలయంలో ఈ నెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ సీనియర్ నాయకులు, క్లస్టరు ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్రలు మాట్లాడుతూ, పట్టభద్రులందరూ ఆలపాటి రాజాను బలపరచాల్సిన వసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ కృష్ణా జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి, ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్త కుర్రా నరేంద్ర, జువ్వా రాంబాబు, అంగిరేకుల మురళి, దోనేపూడి రవికిరణ్, కొండ్రు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలపాటి విజయానికి కృషి చేయాలి

కంకిపాడు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుంకర శివ అన్నారు. కంకిపాడు జనసేన పార్టీ కార్యా లయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు దారం రమేష్, బోయిన నాగరాజు, తంబళ్ల వీరాస్వామి, గందం కృష్ణారావు, సుంకర సురేష్, మేకల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లి ప్రధాన రహదారిపై దుకాణాల్లో చోరీ

- పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఘటన



చోరీ జరిగిన దుకాణం.. పగలుకొట్టిన క్యాష్ బాక్స్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : వీరవల్లిలో ప్రధాన రహదారి పక్కన పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలోని రెండు దుకాణాల్లో శనివారం రాత్రి వరుస చోరీలు జరిగాయి. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. వీరవల్లి ప్రధాన రహదారి వెంబడి ఉన్న సత్యనారాయణ స్వీట్స్ అండ్ బేకరీతో పాటు ఎదురుగా గల లక్ష్మీస్వీట్స్ అండ్ బేకరీ దుకాణాల షట్టర్ తాళాలను పగలగొట్టి దుకాణంలో గల నగదు, కొంత సామాను దొంగిలించారు. ఆదివారం తెల్లవారుజామున పాలు తీసుకునేందుకు వెళితే దుకాణం షట్టర్ పగలకొటి ఉందని, క్యాష్‌పెట్టెలో ఉన్న రూ. 8వేల నగదు, 12వేల విలువైన మిఠాయి(చాక్లెట్లు) చోరీ జరిగిందని దుకాణం యజమాని ఆంజనేయులు వివరించారు. బాధితుడి ఫోన్‌కు స్పందించి క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించినట్టు హెడ్ కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు.

పోలీసుల నిర్లక్ష్యంపై బాధితుల ఆగ్రహం

చోరీ జరిగిందని తెల్లవారుఝామున పోలీస్‌స్టేషన్‌కు వెళితే పట్టించుకున్న వారు లేరని, ఎస్సై శ్రీనివాస్ ఉయ్యూరు తిరునాళ్ల విధి నిర్వహణలో ఉండటంతో తప్పని పరిస్థితుల్లో డయల్ 100(112)కు ఫోన్ చేశామని బాధితులు తెలిపారు. ఫిర్యాదు నమోదు చేసేందుకు కూడా ఆదివారం సాయంత్రం వరకూ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగవలసి వచ్చిందంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. చోరీ జరిగిన వివరాలు తెలిపేందుకు కూడా పోలీసులకు సమయం లేకపోవడం గమనార్హం.

దాతల సహకారంతోనే క్రీడా ప్రాంగణం అభివృద్ధి



శంకర్ నారాయణ, సీత దంపతులను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

గన్నవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం అభివృద్ధికి అమెరికాకు చెందిన ప్రవాసాంధ్రులు శంకర నారాయణ భరద్వాజ శ్రౌతి, సీత దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈ మేరకు శంకర్‌నారా యణ, సీత దంపతులను వాకర్స్ అసోసియేషన్ తరుపున దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. వాకర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు టీఎస్ఆర్‌కె ప్రసాద్, కార్యదర్శి సగ్గుర్తి శ్రీనివాసరావు, తిరివీధి వెంకయ్య, హెచ్ఎంలు కెఎస్ జగదీశ్వరరావు, జీవీ రవిబాబు, చిమట రామారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు వారి మోటార్ల సామర్థ్యానికి తగిన కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి కృష్ణనాయక్ తెలిపారు. ఉయ్యూరు సబ్ డివిజన్ పరిధిలో కేటగిరి 2, 3, 4 సర్వీసులకు నూతన విద్యుత్ మీటర్ల ఏర్పాటు చేస్తున్నామని, వినియోగదారులు వారి మోటారు లోడుకు అనుగుణంగా కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని, లేని పక్షంలో కేవీఏహెచ్ బిల్లింగ్ ఎక్కువ వస్తుందని, విద్యుత్ శాఖ సూచనలు అనుసరించి వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.



కంకిపాడు సర్పంచ్ రమణ, ఉప సర్పంచ్ రాచూరికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్,

పార్టీ అభివృద్ధికి కలిసి పనిచేయండి

కంకిపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కొత్త, పాత అన్న తేడా లేకుండా పార్టీ అభివృద్ధికి కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు పంచాయతీ సర్పంచ్ బాకి రమణ, ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవితో పాటు వార్డు సభ్యులు చిట్టూరి కోటయ్య బాబు, వడ్డాది లీల, కె. వెంకాయమ్మతో పాటు వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, రానున్న నాలుగు సంవత్సరాల్లో కంకిపాడును అన్ని విధాల పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, తాడిగడప మునిసిపాలిటి అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, సుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకటరమణ, వణుకూ రు విక్రం, బండి శ్రీను, చిట్టూరి నాగేశ్వరరావు, మారేషు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గ్రామాధ్యక్షుడు గైర్హాజరు

కంకిపాడు సర్పంచ్ బాకి రమణ, ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి తెలుగుదేశం పార్టీలో చేరికలను ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు చలవాది రాజా తీవ్రంగా విమర్శించారు. దీంతో ఆదివారం పోరంకిలో జరిగిన చేరకలకు ఆయన గైర్హాజరు అయ్యారు. ఆయనతో పాటు పలువురు కంకిపాడు టీడీపీ నాయకులు హాజరు కాకపోవడంతో ఇరు వర్గాలను ఎమ్మెల్యే సమన్వయం చేయగలరా అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ముడా చైర్మన్ మట్టా ప్రసాద్

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

- ముడా చైర్మన్ మట్టా ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, అంకితభావంతో విద్యనభ్యసించాలని మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) చైర్మన్ మట్టా ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం కానూరులోని శ్రీవికాస్ పాఠశాల మొదటి వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. స్థాపించిన మొదటి ఏడాదే కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షల్లో అగ్రగామిగా నిలిచి విద్యార్థుల, తల్లిదండ్రుల మన్ననలు పొందిన యాజమాన్యాన్ని అభినందించారు. రానున్న కాలంలో విద్యార్థుల మరింత ఉన్నతికి కృషి చేస్తామని డైరెక్టర్లు చిత్రీజు లక్ష్మీరాం, రఘు రాం, రంజిత్‌రాంలు భరోసా ఇచ్చారు. పాఠశాల వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ తోట సతీష్‌కుమార్, డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

గన్నవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి డబ్బులు ఇవ్వలేదని పురుగుల మందు తాగి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్కూరు ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన రానిమేకల వీరబాబు(44) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసై డబ్బుల కోసం భార్య మల్లేశ్వరిని నిత్యం వేధిస్తున్నాడు. బైక్ రిపేర్ చేయించాలని నెపంతో శనివారం భార్యను రూ.వెయ్యి అడుగగా నిరాకరించింది. దీంతో మనస్తాపం చెందిన వీరబాబు గడ్డి మందు తాగి పడిపోయాడు. విషయం తెలుసుకున్న అతని బంధువులు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. భార్య మల్లేశ్వరీ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

తిరునాళ్లలో అధికారుల పర్యవేక్షణ

ఉయ్యూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మతిరునాళ్లలో ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అమవారి గ్రామోత్సవం సందర్భంగా, ఆలయం వద్ద ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలను మండల తహసీల్దార్ ఎం సురేశ్‌కుమార్, ఉయ్యూరు కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో శేషగిరిరావు, ఆర్ఐ యతేంద్రియులు, వీఆర్వోలు, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ ఇతర అధికారులు రెండురోజులనుంచి పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితులు తెలుసుకుంటున్నారు.



తిరునాళ్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

కొండాలమ్మ సేవలో జిల్లా న్యాయాధికారి అరుణసారిక



గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని ఆదివారం జిల్లా జడ్జి అరుణ సారిక దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపినట్లు ఆలయ కార్య నిర్వహ ణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం జిల్లా న్యాయమూర్తి అరుణసారికను ఈవో కొండ సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆదివారం అమ్మవారిని 22 వేల మంది భక్తులు దర్శించుకొన్నారని కొండలరావు తెలిపారు.



స్వచ్ఛ భారత్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న ఆదిత్య కళాశాల విద్యార్థులు

బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛ భారత్

గుడివాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం బస్టాండ్‌లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. 25 మంది విద్యార్థులు బస్టాండ్ ఆవరణలో హరిత భారతదేశంపై సదస్సు నిర్వహించారు. అనంతరం తుమ్మల రాంబ్రహ్మం పార్కును శుభ్రపరిచారు. అనంతరం స్వచ్ఛభారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ జీవన్, విద్యార్థులు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

గుడివాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటంటే గోల్డ్ మెడల్ కాదని, జాగ్రత్తగా మసలుకోవాలని ఒన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు డీఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. చెడు నడత కలిగిన రౌడీషీటర్లపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. అల్లర్లు, అలజడులు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రమేయం ఉందని తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్ములూరులో ఆదివారం మణిపాల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు జిల్లా 204 వాకర్స్ ఎలెక్ట్ గవర్నర్ లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, గుత్తా శివరామకృష్ణ, అధ్యక్షుడు కోన రామారావు శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ శ్రీదివ్య కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సందీప్ గుండె పరీక్షలు, డాక్టర్ ఇమ్మానియేలు జనరల్ పరీక్షలు, డాక్టర్ అజయ్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ చంద్రశేఖర్, దిమ్మిటి శ్రీనివాసరావు, లింగం చిట్టిబాబు, బొప్పన కుటుంబరావు, కొమరోలు రామకృష్ణ, మసిముక్కు వెంకటేశ్వరరావు, పినపాల చంద్రశేఖర్, మెరుగుమాల శివరామకృష్ణ, మాచర్ల రామకృష్ణ, డి.సురేంద్ర, దర్శి సత్యనారాయణ, పల్లెబాట ప్రసాద్, టీడీపీ నవీన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెంట్రప్రగడలో..



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెదపారుపూడి : వెంట్రప్రగడలో వంకినేని వెంకట శేషయ్య- రామబ్రహ్మం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రక్తపరీక్ష, బీపీ, షుగర్ పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ వంకినేని కుచేలుబాబు మాట్లాడుతూ ఉదయాన్నే వాకింగ్ చేస్తే శరీరానికి శక్తి లభిస్తుందన్నారు. ఆహారంలో నూనె వాడకం తగ్గిస్తే గుండెకు ఎటువంటి అనారోగ్యం ఉండదన్నారు. మాజీ ఎంపీపీ పునుకొల్లు వెంకట రత్నప్రసాద్ (పాపాయి), జాజుల నాగేశ్వరరావు, వంకినేని శివరామకృష్ణ పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పీడీకి కాంస్య పతకం



కూచిపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మొవ్వ జడ్పీ పాఠశాల పీడీ అప్పికట్ల రామారావు ఐదు కిలో మీటర్లు నడక, ట్రిపుల్ జంప్, 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, పాఠశాల విద్యాకుటుంబం విజేతగా నిలిచిన రామారావుకు అభినందనలు తెలిపారు.

మానవ సేవే మాధవ సేవ

నందివాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు సేవలు అందిస్తున్నామని జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి అన్నారు. తుమ్మలపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సింగాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం యూపీ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మాజీ సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సింగాల రాధాకృష్ణ ప్రారంభించారు. ఈఎన్‌టీ, కంటి, దంత పరీక్షలు జరిపి మందులు ఉచితంగా అందజేశారు. దండమూడి సీతారామస్వామి, పద్మజ, చంద్రశేఖర్, రాధాకృష్ణ, బ్రహ్మయ్య, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ విస్సంశెట్టి కిషోర్ బాబు, వైస్ సర్పంచ్ మద్ద సత్యనారాయణ, సాదం సాంబయ్య, కేశవరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



తుమ్మలపల్లిలో వైద్యశిబిరంలో మాట్లాడుతున్న సర్పంచ్ రాధాకృష్ణ

విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యతనివ్వాలి

● ఆదాయ పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ అజయ్‌కుమార్
● విశ్వభారతి వైజ్‌వుడ్స్‌లో ఘనంగా క్రీడా దినోత్సవం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ

పెదపారుపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదాయ పన్నుశాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. విశ్వభారతి వైజ్‌వుడ్స్ పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అజయ్‌కుమార్ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించి, క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలతో మానసిక, శారీరక ప్రశాంతత చేకూరుతుందన్నారు. విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మనిషికి విద్య ఎంత అవసరమో క్రమశిక్షణ కూడా అంతే అవసరమన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ అలవాటు చేసుకోవచ్చునన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఆటల పోటీల్లో గెలపొందిన విజేతలకు విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరెక్టర్లు ఆర్.మంజుల, ఆర్.ప్రణీత్, కీర్తి బహుమతులను అందజేశారు. తొలుత అజయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైజ్‌వుడ్స్ డీన్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ శిరీష, సిఇవో కృష్ణారెడ్డి, ప్లస్-1, ప్లస్-2 ఇన్‌చార్జ్ హరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదాయపన్ను విశ్రాంత చీఫ్ కమిషనర్ అజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

వృద్ధురాలికి పాదాభివందనం

● బంగారు గొలుసు మాయం

పామర్రు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కిరాణా దుకాణం నడుపుతున్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరించుపోయిన సంఘటన పామర్రులోని అరండల్ పేటలో ఆదివారం చోటు చేసుకుంది. ఏరువాక పుణ్యవతి (63) నడిపే దుకాణంలోకి ఇద్దరు అగంతుకులు వచ్చి బిస్కెట్ ప్యాకెట్ కొనుగోలు చేశారు. అనంతరం సమీపంలోని రామాలయంలోకి రండి మామ్మగారు.. మీకు పాదాభి వందనం చేసుకుంటామంటూ ఆమెను మాయమాటలతో గుడిలోకి తీసుకునివెళ్లి వృద్ధురాలి మెడలోని రెండున్నర కాసుల బంగారు గొలుసు వంద రూపాయల నోటుతో ఉంచాలని నమ్మించి బిస్కెట్ల కవర్‌లో రెండూ కలిపి దేవుడి దగ్గర పెట్టినట్టు చూపించి గొలుసును అపహరించి, వచ్చిన బైక్‌తో పరారయ్యారు. మోసాన్ని గ్రహించిన ఆమె పామర్రు ఎస్సై రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని ఆమె వద్ద వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినీ ఫక్కీలో అర్చకుడి గొలుసు చోరీ

మచిలీపట్నం టౌన్ : సినీ ఫక్కీలో మచిలీపట్నం గొడుగుపేట వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అర్చకుని మెడలోని బంగారపు గొలుసును గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు దొంగిలించారు. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చి తాము బంగారం వ్యాపారం చేస్తామని, సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి స్వరూపులైన మీ మెడలో ఉన్న బంగారపు గొలుసును తాకితే తమకు ఐశ్వర్యం వస్తుందని అర్చకులు ముత్తేవి లీలా కృష్ణమాచార్యులు నమ్మబలికారు. బంగారు గొలుసును కవరులో పెట్టి తాకించాలని దొంగలు కోరారు. ధ్వజస్థంభం వద్దకు దొంగలు పూజారిని తీసుకుని వెళ్లారు. ముత్తేవి లీలాకృష్ణమాచార్యులు తన మెడలోని బంగారపు గొలుసును తీసి, కవరులో పెట్టి ఇచ్చారు. దొంగలు దక్షిణ ఇస్తున్నామంటూ ఐదు వంద రూపాయలు కవరులో అర్చకునికి కనబడే విధంగాపెట్టి ఇచ్చారు. బంగారు గొలుసును కాజేసి, దాని స్థానంలో బిస్కెట్ కవరు ఉంచి అదే బంగారు గొలుసు ఉన్న కవరని చెప్పారు. గొలుసు ఉన్న కవరును తీసుకుని దొంగలు పారిపోయారు. అర్చకుడు గుళ్లోకి వచ్చి తన గొలుసు వేసుకుందామని చూస్తే బంగారు గొలుసు బదులు బిస్కెట్ ప్యాకెట్ ఉన్న కవరు కనబడింది. అర్చకుడు ముత్తేవి లీలా కృష్ణమాచార్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గొలుసు విలువ రూ. లక్షా 30 వేల వరకు ఉంటుందని అర్చకుడు చెప్పారు.



కానూరులో ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాన్ని విడుదల చేస్తున్న శ్రీనివాసరెడ్డి

చట్ట సభల్లోకి విద్యావంతులను పంపుదాం

రాష్ట్ర అగ్రికల్చరల్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపు

పెనమలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం, భవిష్యత్తు తరాల కోసం చట్టాలు రూపొందించే చట్ట సభల్లోకి ఉన్నత విద్యావంతులనే పంపిద్దామని ఏపీ అగ్రికల్చరల్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివా రం కానూరు టీడీపీ కార్యాలయంలో ఈ నెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ సీనియర్ నాయకులు, క్లస్టరు ఇన్‌చార్జిలు, యూ నిట్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్రలు మాట్లాడుతూ, పట్టభద్రులందరూ ఆలపాటి రాజాను బలపరచాల్సిన వసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ కృష్ణాజిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి, ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్త కుర్రా నరేంద్ర, జువ్వా రాంబాబు, అంగిరేకుల మురళి, రవికిరణ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డుపడుతున్న అధికారులు

● పెదపారుపూడి సర్పంచ్ సమీర భర్త చప్పిడి కిషోర్

పెదపారుపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పెదపారుపూడి సర్పంచ్ సమీర భర్త చప్పిడి కిషోర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదర్శ గ్రామంగా పెదపారుపూడి అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర చౌదరి గ్రామాభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు అభివృద్ధి చేయాల్సింది పోయి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల్లో ఆగ్రహాలు తెప్పిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు, పార్టీ నాయకులు స్పందించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.



కంకిపాడు సర్పంచ్ రమణ, ఉప సర్పంచ్ రాచూరికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్,

పార్టీ అభివృద్ధికి కలిసి పనిచేయండి

కంకిపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) :కొత్త, పాత అన్న తేడా లేకుండా పార్టీ అభివృద్ధికి కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు పంచాయతీ సర్పంచ్ బాకి రమణ, ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవితో పాటు వార్డు సభ్యులు చిట్టూరి కోటయ్య బాబు, వడ్డాది లీల, కె. వెంకాయమ్మతో పాటు వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, రానున్న నాలుగు సంవత్సరాల్లో కంకిపాడును అన్ని విధాల పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, తాడిగడప మునిసిపాలిటి అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, సుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకటరమణ, వణుకూరు విక్రం, బండి శ్రీను, చిట్టూరి నాగేశ్వరరావు, మారేషు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లలో అధికారుల పర్యవేక్షణ

ఉయ్యూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మతిరునాళ్లలో ఏవిధమైన అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అమవారి గ్రామోత్సవం సందర్భంగా, ఆలయం వద్ద ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలను మండల తహసీల్దార్ ఎం సురేశ్‌కుమార్, ఉయ్యూరు కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో శేషగిరిరావు, ఆర్ఐ యతేంద్రియులు, వీఆర్వోలు, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ ఇతర అధికారులు రెండురోజులనుంచి పర్యవేక్షిస్తూ ఎప్పటి కప్పుడు పరిస్థితులు తెలుసుకుంటున్నారు.



తిరునాళ్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు గాలికి!

● గాలిపెట్టే మిషన్లు ఉండవు ● యంత్రాలు ఉన్నా పనిచేయవు ● ఇతర సౌకర్యాలు శూన్యం

(ఆంధ్రజ్యోతి-నందివాడ)

వాహనదారులకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన నిబంధనలను పెట్రోల్ బంకుల యజమానులు పాటించడం లేదు. పెట్రోలు బంకుల్లో వాహనాదారులకు టాయ్‌లెట్‌లు, ఉచితంగా గాలి మిషన్లు ఏర్పాటు చేయాలన్న నిబంధనలు పాటించడం లేదు. బంకు యజమానులు పెట్రోల్, డీజిల్ అమ్ముకొని డబ్బులు సంపాదించుకోవటమే తప్ప వాహన దారులు సౌకర్యాలపై దృష్టి సారించడం లేదు. పెట్రోలు బంకుల్లో గాలి మిషన్లు అలంకారప్రాయంగా ఉంటున్నాయి తప్ప వాహనదారులకు సేవలందించిన పాపాన పోవడం లేదు. పాడైపోయిన మిషన్లు పెట్టి వాహనదారులను మురిపిస్తున్నారు. మండలంలో నాలుగు పెట్రోల్ బంకులు ఉన్నప్పటికీ ఏ ఒక్క బంకులోను గాలి మిషన్లు లేవు. కొన్ని బంకుల్లో గాలి పెట్టే యంత్రాలు ఉన్నా అవి పనిచేయడం లేదు. ప్రయాణ సమయంలో మధ్యలో బైక్‌లకు, ఫోర్ వీలర్ వాహనాలకు టైర్లలో గాలిపోతే కిలో మీటర్లు నడుచుకుంటూ, తోసుకుంటూ వెళ్లాల్సిందే. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. సంబంధిత అధికారులు పెట్రోలు బంకులను తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెట్రోల్ బంకుల యజమానులు నిబంధనలు పాటించి గాలిపెట్టే యంత్రాలు, టాయ్‌లెట్ సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అలంకారప్రాయంగా గాలిపెట్టే మిషన్



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రజని

గుడ్లవల్లేరు లయన్స్ సేవలు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఉచిత మధు మేహవ్యాధి చికిత్సా శిబిరం నిర్వహించారు. డాక్టర్ గవిర్నేని రజని 119 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గవిర్నేని లలిత కుమారి జ్ఞాపకార్థం వారి కుమారుడు సజ్జా సీతారామయ్య చౌదరి వితరణతో 50 మందికి అన్నదానం నిర్వహించారు. వడ్లమూడి విజయలక్ష్మి జ్ఞాపకార్థం వడ్లమూడి చిట్టిబాబు కుటుంబ సభ్యులు మరో 50 మందికి అన్నదానం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు శశికళ, వై.పి.సి ప్రసాద్, జంగం మోహనరావు, పరంధామయ్య, సుధాకర్, ఆదినారాయణ, పాల్గొన్నారు

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

టెన్త్ ప్రీ పబ్లిక్ పరీక్ష నేటి నుంచి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం నుంచి జరిగే టెన్త్ ప్రీ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో పి.వి.జె. రామారావు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు ఈ పరీక్షలకు హాజరవుతారన్నారు. జిల్లాలోని 391 పాఠశాలలకు చెందిన 21,009 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ఉదయం గం. 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరిగే ఈ పరీక్షలు విద్యార్థుల సామర్థ్యాన్ని తెలియచేస్తాయన్నారు. మార్చి 17వ తేదీన నిర్వహించనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఈ పరీక్షలు ఒక సోపానం కానున్నాయి.



నాగిడి గాయత్రికి సీపీ అభినందన

విజయవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రి రిషికేష్‌లో జరిగిన 38వ జాతీయ స్థాయి జలక్రీడల్లో పాల్గొని కెనాయ్ స్లాలమ్ కె-1 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఆదివారం విజయవాడలో ఆమె సీపీ ఎస్.వి. రాజశేఖర్‌బాబును మర్యాద పూర్వకంగా కలిసింది. నాగిడి గాయత్రిని ఆయన అభినందించి, శాలువాతో సత్కరించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గాయత్రి మాట్లాడుతూ...హెడ్‌కానిస్టేబుల్ తిప్పిరెడ్డి శివారెడ్డి ఇచ్చిన శిక్షణ, ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ, పారిశ్రామికవేత్త అప్పికట్ల అప్పారావు మరికొంత మంది దాతలు, ప్రభుత్వ ఇచ్చిన ప్రోత్సాహమే తన విజయానికి కారణమన్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారంతో ఆసియా, ఒలింపిక్ గేమ్స్‌లోను పతకాలు సాధిస్తానన్నారు. గాయత్రి తల్లిదండ్రులు, ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ, హెడ్‌కానిస్టేబుల్ శివారెడ్డి పాల్గొన్నారు.



రెండు బైక్‌లు, టాటా మ్యాజిక్ వాహనాన్ని ఢీకొన్న కారు, దుర్మరణం చెందిన విన్నకోట సాంబశివరావు



ఆటో పల్టీ కొట్టి గాయపడిన వెంకన్న

కారు స్వైర విహారం...ఒకరి మృతి

● రెండు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి తీవ్రగాయాలు

గూడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై రామరాజుపాలెం అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం కారు స్వైర విహారం చేసింది. డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లవోలుకు చెందిన విన్నకోట సాంబశివరావు (55) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు రెండు ద్విచక్ర వాహనాలను, టాటా మ్యాజిక్ వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదంలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి. మల్లవోలు గ్రామానికి చెందిన విన్నకోట సాంబశివరావు గూడూరులోని తన కుమార్తె ఇంటికి వచ్చి తిరిగి వెళుతుండగా రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్దకు వచ్చే సరికి కారు సాంబశివరావు వాహనాన్ని ఢీకొంది. తలకు బలమైన గాయం కావడంతో సాంబశివరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సాంబశివరావును ఢీకొన్న కారు ముందుగా వెళుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో పాటు పక్కన ప్రయాణికులను దించుతున్న టాటా మేజిక్ వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బందరుకు చెందిన ద్విచక్ర వాహనదారుడు ఈడే రాంబాబుకు గాయాలయ్యాయి. మేజిక్ డ్రైవర్ పేరం రాముడు, అందులో ప్రయాణిస్తున్న బందరు మండలం పల్లెతుమ్మలపాలెంకు చెందిన కామేశ్వరమ్మకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పెడన సీఐ కె. నాగేంద్రప్రసాద్, గూడూరు ఎస్సై కె.ఎన్.వి. సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించాడు. బాధితులను, సాంబశివరావు భౌతికకాయాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఆటో పల్టీ కొట్టి....

మోపిదేవి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆటో పల్టీ కొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన మోపిదేవి వార్పు వద్ద ఆదివారం ఉదయం జరిగింది. మచిలీపట్నం శివారు కానూరుకు చెందిన మోకా చిన్న వెంకన్న, డి.శ్రీరామ్ ఇరువురు ఆటోలో చేపలను నాగాయలంక తీసుకెళ్తుండగా, మోపిదేవి వార్పు వద్ద కోత యంత్రం లోడుతో వస్తున్న మినీ లారీని తప్పించబోయి ఆటో పల్టీ కొట్టింది. ఆటోలో ఉన్న ఒక వ్యక్తికి కాలు విరుగగా, మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లినట్లు సమాచారం.

అర్చకుడు, వృద్ధురాలికి టోకరా

● బంగారు గొలుసులతో ఉడాయించిన అగంతకులు

మచిలీపట్నం టౌన్ , ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సినీ ఫక్కీలో అర్చకుడికి టోకరా వేసి మెడలోని బంగారు గొలుసు అపహరించిన సంఘటన గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగింది. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చి తాము బంగారం వ్యాపారం చేస్తామని, సాక్షాత్తు వేంకటేశ్వర స్వామి స్వరూపులైన మీ మెడలో ఉన్న బంగారు గొలుసును తాకితే తమకు ఐశ్వర్యం వస్తుందని అర్చకులు ముత్తేవి లీలా కృష్ణమాచార్యులను నమ్మబలికారు.

లీలా కృష్ణమాచార్యులను ధ్వజస్తంభం వద్దకు తీసుకెళ్లి మెడలోని బంగారపు గొలుసు తీసి కవరులో పట్టి ఇస్తే తాకి ధన్యులమవుతామన్నారు. దక్షిణ పేరుతో ఐదు వంద రూపాయల నో ట్లు కవరులో అర్చకునికి కనబడే విధంగా పెట్టి ఇచ్చారు. బంగారు గొలుసును కాజేసి, దాని స్థానంలో బిస్కెట్ కవరు ఉంచి అదే బంగారు గొలుసుగా నమ్మించి, గొలుసు ఉన్న కవరును తీసుకుని దొంగలు పారిపోయారు. అర్చకుడు ముత్తేవి లీలా కృష్ణమాచార్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బంగారు గొలుసు తన పూర్వీకుల నుంచి వచ్చిందని, దాని విలువ రూ. లక్షా 30 వేల వరకు ఉంటుందని అర్చకుడు చెప్పారు.

పాదాభివందనం చేసి...

పామర్రు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పామర్రులోని అరండల్ పేటలో కిరాణా దుకాణం నడుపుతున్న ఏరువాక పుణ్యవతి (63) వద్దకు ఇద్దరు అగంతుకులు వచ్చి బిస్కెట్ ప్యాకెట్ కొనుగోలు చేశారు. అనంతరం మామ్మగారు..మీకు పాదాభి వందనం చేసుకుంటామంటూ ఆమెను మాయమాటలతో సమీపంలోని రామాలయంలోకి తీసుకునివెళ్లి వృద్ధురాలి మెడలోని రెండున్నర కాసుల బంగారు గొలుసు వంద రూపాయల నోటుతో ఉంచాలని నమ్మించారు. బిస్కెట్ల కవర్‌లో రెండూ కలిపి దేవుడి దగ్గర పెట్టినట్టు చూపించి గొలుసును అపహరించి వచ్చిన బైక్‌తో పరారయ్యారు. మోసాన్ని గ్రహించిన ఆమె పామర్రు ఎస్సై రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్యకాపరమేశ్వరికి విశేష అర్చన



పెడన, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సంఘం, వాసవీ మం డలి సంయుక్త ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీ దేవిని ఆదివారం భారీగా పసుపు కుంకుమతో పూజించారు. 21 రకాల ద్రవ్యాలతో శివపార్వతులను అభిషేకించారు. వాసవీ మహిళా మండలి సభ్యులు లలిత పారాయణ చేశారు. ఆర్యవైశ్య దంపతులు పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కే.టి. మురళీకృష్ణ, దేసు శ్రీనివాస్, కొల్లూరి రాధాకృష్ణగుప్తా, కొల్లిపర పూర్ణప్రదీప్, కొమ్మూరి శారద, పొన్నూరు అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి జ్యోతిర్మహోత్సవాలపై డీఎస్పీ సమీక్ష

పెడన, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మపురంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న చౌడేశ్వరీ దేవి జ్యోతిర్మహోత్సవాలను పురస్కరించుకుని బందరు డీఎస్పీ చప్పిడి రాజా, ఎస్సై సత్యనారాయణతో కలసి ఆదివారం ఉత్సవ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమై ఉత్సవాలు నిర్వహించే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై సత్యనారాయణను డీఎస్పీ ఆదేశించారు. పట్టణమంతా సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకున్నామని ఎస్సై తెలిపారు. ఉత్సవాల సమయంలో పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహించాలని డీఎస్పీ ఆదేశించారు.

మచిలీపట్నంలో బీజేపీ సంబరాలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం పొందినందుకు మచిలీపట్నంలో బీజేపీ శ్రేణులు ఆదివారం విజయోత్సవాలు నిర్వహించారు. కూనపరెడ్డి శ్రీనివాసరావు, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, పంతం గజేంద్ర, సూరిశెట్టి హరికృష్ణ, మాదిరెడ్డి సతీష్, చలమలశెట్టి రామకృష్ణ, ఘంటా సతీష్, సిహెచ్. మల్లేశ్వరరావు, వన్నెంరెడ్డి ప్రసన్నకుమార్, జె.వి. సుబ్బారావు, వెన్నా దుర్గ, జూపూడి వెంకటాచలం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి విజయానికి కృషి చేయాలి

గూడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని మండల టీడీపీ ఛైర్మన్ పోతన స్వామి కోరారు. మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలోని ప్రతి ఒక్క ఓటరును కలసి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. కట్టా మునీశ్వరరావు, ఎన్‌ఏ బేగ్, సిరివెళ్ళ శ్రీనివాసరావు, వాకా శ్రీనివాసరావు, సూరారపు అంజనేయులు, తోట వేణు, జన్ను ప్రసాద్, గోవర్ధన్, బత్తిన రామకృష్ణ, గొరిపర్తి చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.



అరుణసారికకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

కొండాలమ్మ సేవలో జిల్లా న్యాయాధికారి అరుణసారిక

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని ఆదివారం జిల్లా జడ్జి అరుణ సారిక దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం జిల్లా న్యాయమూర్తి అరుణసారికను ఈవో కొండలరావు సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆదివారం అమ్మవారిని 22 వేల మంది భక్తులు దర్శించుకొన్నారని కొండలరావు తెలిపారు.

కాపులు అన్ని రంగాల్లో ఎదగాలి



కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగబాబును సత్కరిస్తున్న మురళీకృష్ణనాయుడు

బంటుమిల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో కాపులు ఎదగడ మే ధ్యేయమని జాతీయ కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణ నాయుడు అన్నారు. నరసప్పచెరువు గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయిలో కాపు సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. మంగళగిరిలో జాతీయ కాపు సంఘం కార్యాలయం ఏర్పాటు చేసి, టోల్ ఫ్రీ నెంబరు అందుబాటులోకి తెస్తామన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి అధ్యక్ష, కన్వీనర్‌లకు నియామక పత్రాలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కూనసాని నాగబాబును ఘనంగా సత్కరించారు. బసవ చినబాబు, కోటి వెంకటరెడ్డి, గల్లా రామాంజనేయులు, గౌరిశెట్టి నాగరాజు, వాసుదేవకృష్ణ భీమరాజు, వెంకన్నబాబు, గంధం గోవర్ధన, నియోజకవర్గాల అధ్యక్షులు, కన్వీనర్‌లు పాల్గొన్నారు.



స్వచ్ఛ సారథులు డీఆర్కే దంపతులతో స్టేట్‌బ్యాంక్, విశ్రాంత బ్యాంకు అధికారులు

బ్యాంకు అధికారుల బృందం చల్లపల్లి సందర్శన

చల్లపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్, వరంగల్‌కు చెందిన స్టేట్‌బ్యాంకు అధికారులు, విశ్రాంత బ్యాంకు అధికారుల బృందం ఆదివారం చల్లపల్లిని సందర్శించారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్ సోదరి, విశ్రాంత ఎస్‌బీఐ మేనేజర్ దాసరి లక్ష్మీరాణి ద్వారా చల్లపల్లి విచ్చేసిన వారు స్వచ్ఛ చల్లపల్లి విశేషాలు తెలుసుకున్నారు. ఆదివారం నాటి 3379వ రోజు స్వచ్ఛ సేవలో పాల్గొన్నారు. స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి శ్రమదానం చేశారు. డాక్టర్ డీఆర్కే పసాద్, డాక్టర్ పద్మావతి గ్రామం కోసం కష్టపడటం, స్ఫూర్తివంతమైన ఉద్యమానికి నేతృత్వం వహించటం ఎంతో గొప్పవిషయమన్నారు. బ్యాంకు అధికారులు శర్వాణి, రాధ, పద్మ, స్వర్ణలత, రజని, రాజమణి, గీతాంజలి, సరిత, ముక్తేశ్వర్ స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన వారిలో ఉన్నారు.

మృతుని కుటుంబసభ్యులకు విక్కుర్తి పరామర్శ



ఘంటసాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎర్రబోయిన శివ కాకుళేశ్వరరావు అలియాస్ పానకాలు (67) కుటుంబ సభ్యులను ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. పానకాలు కుమారుడు సూర్యనారాయణతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విక్కుర్తి రాంబాబు, పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీనివాసరావు, బొప్పన పవన్, పోతన ఆంజనేయులు, పోతన కాకులేశ్వరరావు, అంబటి నాగరాజు, కొండవీటి ఏడుకొండలు, కొల్లిపర పద్మాకర్, పోతన రవి, తిరుమలశెట్టి బోసు, బత్తుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు రావెళ్ల ఫౌండేషన్ సహాయం

చల్లపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తకు రావెళ్ల ఫౌండేషన్ ఛైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ ఆర్థికసాయం చేశారు. పురిటిగడ్డ చేనేత కాలనీకి చెందిన తిరువీధుల పరశురామ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఉదయ్‌కుమార్ ఆదివారం అతడిని పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు రాజులపాటి అంకమ్మ, టీడీపీ నేతలు పరుచూరి సురేష్, దేవభక్తుని గోపాలకృష్ణ, మోర్ల శివ, కైతేపల్లి శ్రీనివాసరావు, తాతా ప్రదీప్, దివి సత్యనారాయణ, వంగర భిక్షాలు, తిరువీధుల బసవరావు పాల్గొన్నారు. మంగళాపురం దళితవాడలోని అంగన్‌వాడీ పాఠశాలకు మోటార్‌ను, ఏలూరులో కేన్సర్‌తో, నల్లజర్లలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఇద్దరు మహిళలకు రూ.10 వేలు చొప్పున సహాయం అందించినట్లు రావెళ్ల ఉదయ్‌కుమార్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బంటుమిల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో సాతులూరు గ్రామంలో ఇల్లు అగ్నికి ఆహుతి అయ్యింది. ఒక్కసారిగా మంటలు లేచి మద్దిబోయిన సత్యనారాయణ ఇంట్లో విలువైన పత్రాలు, వస్తువులు, పంట నగదు లక్ష రూపాయలు, బంగారం అగ్నికి కాలిపోయాయి. అగ్నిమాపక శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దాదాపు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు.

కార్యకర్తలకు గోవర్ధన్ కృతజ్ఞతలు


అవనిగడ్డ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీడీపీ కార్యకర్తలు, నాయకులకు పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. అందరి కృషితో నియోజకవర్గంలో సభ్యత్వాలు 42,022కు చేరుకున్నాయన్నారు.

బీచ్‌లో పర్యాటకుల స్నానాలు

కోడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పాలకాయితిప్ప బీచ్‌లో ఆదివారం పర్యాటకు సందడి చేశారు. సముద్రంలో స్నానాలు చేసి కేరింతలు కొట్టారు. మెరైన్, పోలీసు సిబ్బంది పర్యాటకు రక్షణార్థం సముద్ర తీరం వెంబడి గస్తీ నిర్వహించారు. స్నానం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

గ్రామ పరిశుభ్రతే ప్రధాన లక్ష్యం

కోడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పరిసర ప్రాంతాల పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలని కోడూరు సర్పంచ్ వెన్నా షైనీ అన్నారు. వంతెన సెంటర్ పరిసర ప్రాంతాలలో రహదారి వెంబడి ఉన్న పిచ్చిమొక్కలను గ్రామపంచాయతీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు తొలగించారు. పరిశుభ్రపరిచిన ప్రాంతంలో మొక్కలు నాటుతా మన్నారు. పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు, వార్డుసభ్యులు వెన్నా ప్రసాద్ పాల్గొన్నారు.



విక్కుర్తిని సత్కరిస్తున్న వీరవసంతరావు

సూర్యనారాయణ స్వామి కల్యాణం

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం రాజశేఖర శర్మ బ్రహ్మత్వంలో వర్రే గోపి - సింధుజ దంపతులు నిర్వహించారు. రేపల్లె చేతన బాబు, తండ్రి గోవర్ధనరావు ఆర్థిక సహాయంతో అన్నసమారాధన జరిపారు. పారిశ్రామిక వేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు ఆయను ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు. విక్కుర్తి రాంబాబు తదిరతులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ప్రముఖుల ఆశీర్వాదం

నాగాయలంక, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక మాజీ జడ్పీటీసీ సభ్యుడు కే.శే. కన్నా జనార్ధనరావు కుమారుడు నవీన్‌బాబు దంపతులను మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎంపీ మోపిదేవి వెంక ట రమణారావు, అగ్నికుల క్షత్రియుల ఛైర్మన్ చిలకలపూడి పాపారావు ఆశీర్వదించారు. నవీన్‌బాబు రిసెప్షన్‌కు వారు హాజరుకాగా, కన్నా నాగరాజు సాదర స్వాగతం పలికారు. మండలి వెంకట్రామ్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, టీడీపీ నేతలు మెండు లక్ష్మణరావు, మండవ బాలవర్ధిరావు, బొబ్బా గోవర్ధన్, తలశిల స్వర్ణలత, లకనం నాగాంజనేయులు, యాసం చిట్టిబాబు, మత్తి వెంకటేశ్వరరావు, ఉప్పల ప్రసాద్, లంకే శ్రీనివాస ప్రసాద్, మేడికొండ విజయ్, రేవు సువర్ణరాజు ఆశీస్సులు అందజేశారు.